క్లుప్తంగా

తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీవో ప్రకాశ్ అన్నారు. గురువారం నాగిరెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలతో సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులకు కూలీలు ఎక్కువ హాజరయ్యేలా చూడాలన్నారు.

తాడ్వాయి-దేవాయిపల్లి రోడ్డు అధ్వానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని కామారెడ్డి-ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి దేవాయిపల్లి మీదుగా బ్రాహ్మణపల్లి వరకు ఉన్న రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డును బాగు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. రెండేళ్ల క్రితం వేసిన బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటికే అనేకమంది గాయాలపాలై ఇబ్బంది పడుతున్నారన్నారు.

పీఆర్సీ చైర్మన్‌ను కలిసిన టీటీయూ నాయకులు

కామారెడ్డి అర్బన్ : ఉపాధ్యాయుల కనీస వేతనం రూ.69,150గా నిర్ణయించాలని, పాత పెన్షన్ విధానం అమలు చేయాలని పేర్కొంటూ రాష్ట్ర రెండవ వేతన సవరణ సంఘం చైర్మన్ ఎన్ శివశంకర్‌ను తెలంగాణ టీచర్స్ యూనియన్(టీటీయూ) కలిసి వినతిపత్రం అందజేసిందని జిల్లా అధ్యక్షుడు ఎండీ ముజీబొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పీఆర్సీ చైర్మన్‌ను టీటీయూ రాష్ట్ర బృందం కలిసి ఉపాధ్యాయుల మూల వేతనంతో కలుపుకుని 28శాతంతో స్థిరీకరించాలని తదితర డిమాండ్లతో 45 అంశాలపై టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం మణిపాల్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి వివరంగా పత్రాలు అందజేసినట్లు జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ వివరించారు.

డీఎంహెచ్‌వోపై కఠిన చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్ : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో పీహెచ్‌సీలో విధులు నిర్వహించిన మహిళా వైద్యులను లైంగికంగా వేధించిన డీఎంహెచ్‌వోపై కఠిన చర్యలు తీసుకోవాలని కామారెడ్డి మహిళా వేదిక, సిటిజన్స్ అసోసియేషన్, అధ్యయన వేదికల ప్రతినిధులు కే నలిని దేవి, సుధ, జి. జగన్నాథం, వేణుగోపాల్, శ్రీనివాస్, రమణ, అంజయ్య గురువారం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేస్తామని జన సమితి జిల్లా అధ్యక్షుడు కుంబాల లక్ష్మణ్ యాదవ్ మరో ప్రకటనలో తెలిపారు.

ప్రైవేట్ స్కూల్ ఎదుట ఆందోళన



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో విద్యార్థులకు బుక్స్, ఇతర సామగ్రి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఏబీవీపీ నాయకులు స్కూల్‌లో ఆందోళన చేశారు. ఈ విషయం ఎంఈవో ఎల్లయ్యకు సమాచారం ఇవ్వడంతో పాఠశాల వచ్చి విచారణ జరిపారు. యాజమాన్యంతో మాట్లాడి ఎంఈవో వెళ్లాక ఎంఈవో సరైనరీతిలో స్పందించలేదని పేర్కొంటూ అక్కడే బైఠాయించి ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్, జిల్లా హాస్టల్ కన్వీనర్ ఖలీల్, నాయకులు తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



పిట్లం(జుక్కల్) : వాహనదారులు తప్పకుండా ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని పిట్లం - బాన్సువాడ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు, ధృవపత్రాలు లేని వాహదారులకు జరిమానా వేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మించి.. బీటీ రోడ్డు మరిచి..

- కొండాపూర్-ఎల్లారెడ్డిపల్లి మధ్య కొనసాగుతున్న బ్రిడ్జి పనులు
- వాహనదారులకు ఇబ్బందులు

రాజంపేట : రాజంపేట మండలం కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించి సుమారు 9 నెలలు కావస్తున్న ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కో బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3 కోట్ల 43 లక్షలతో ఈ బ్రిడ్జి నిర్మాణ చేపడుతున్నారు. గత వర్షాకాలం కంటే ముందే పనులు ప్రారంభించినప్పటికీ వర్షాకాలంలో పనులకు కాస్త ఆటకం కలిగింది. అనంతరం పనుల వేగవంతం జరిగినా ప్రస్తుతం మాత్రం పనులు నత్త నడకనే కొనసాగుతున్నాయి. బ్రిడ్జి నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నప్పటికీ సంబంధిత బ్రిడ్జికి బీటీ రోడ్డు ఎప్పుడు వేస్తారో అని వాహనదారులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు ఎప్పుడో పూర్తి కావాల్సిన పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనదారుల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో నెల రోజులైతే వర్షాకాలం ప్రారంభం అవుతుంది. పనులు జాప్యం లేకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డిపల్లి వద్ద కొనసాగుతున్న వంతెన పనులు

అందుబాటులోకి తేవాలి



బ్రిడ్జి పనులు చాలా రోజులుగా కొనసాగుతున్నాయి. గత వర్షాకాలంలో ఈ బ్రిడ్జి పనుల వద్ద చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. పనులు చివరి దశలో ఉన్నాయి. కానీ బీటీ రోడ్డు ఇతరత్రా పనులు త్వరగా చేపట్టి రోడ్డు అందుబాటులోకి తేవాలని కోరుతున్నాం.

– యాదాగౌడ్, ఎల్లారెడ్డి పల్లి

పనులు జరిగేలా చూస్తాం..

పనులు జాప్యం వాస్తవమే. గత వర్షాకాలంలో ప్రారంభించడం వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో అందక పనుల విషయంలో జాప్య జరిగింది. కొండాపూర్, ఎల్లారెడ్డి పల్లి బ్రిడ్జి త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

– రవితేజ, ఏఈఈ

వైభవంగా మహరాజ్‌కు తులాభారం



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలో బుధవారం రాత్రి శ్రీ చంద్రశేఖర్ మహరాజ్‌కు నిర్వహించిన తులాభారం కార్యక్రమం వైభవంగా జరిగింది. చుట్టూ పక్కల గ్రామాల నుంచి తులాభారం సందర్భంగా పెద్దసంఖ్యలో వార్కారీలు తరలివచ్చారు. సరిహద్దున ఉన్న దెగ్లూర్ పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర్ మహరాజ్‌కు బెల్లం, చక్కెర, పండ్లు, కాయిన్స్‌తో తులాభారం వేశారు. సుమారు 500 మంది వర్కారీలతో కీర్తన నిర్వహించారు. అనంతరం భక్తులకు నిర్వాహకులు అన్నదాన ఏర్పాటు చేశారు.

19 నుంచి రేణుకాదేవి ఆలయ వార్షికోత్సవం



కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం ఇస్రోజీవాడిలో ఈనెల 19న శ్రీ రేణుకాదేవి జమదగ్ని 18వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 19న రేణుకాదేవి కలశ స్థాపన, 20న స్థాపిత దేవతల పూజ, సాయంత్రం ఎడ్ల బండ్ల ప్రదర్శన, 21న రేణుకా మాత జమదగ్నిల కల్యాణం బోనాలు ఉంటాయన్నారు. 22న తిరుగు బోనాలు ఉంటాయన్నారు.

పీహెచ్‌డీ పట్టా గ్రహీతకు సన్మానం



బాన్సువాడ రూరల్ : మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న రేఖ పీహెచ్‌డీ పట్టా పొందడంతో గురువారం ఆమెను ప్రిన్సిపల్ డా గంగాధర్ అధ్యాపకులతో కలిసి ఘనంగా సన్మానించారు. కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న రేఖ 'స్టడీస్ ఆన్ ఆర్బస్కులార్ మైకోరేజా అండ్ ఆంటీ మైక్రోబియల్ ఆక్టివిటీ ఆఫ్ కేథరాంథస్ రోజియస్ ఎట్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్' అనే అంశంపై తెయూ ప్రొఫెసర్ మమత ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందారని అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గులాం ముస్తఫా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించాలి





రాంపూర్‌లో తనిఖీ చేస్తున్న మిషన్ భగీరథ అధికారిణి రాజ్యలక్ష్మి, జుక్కల్ మండల పరిషత్‌లో..

పిట్లం(జుక్కల్) : గ్రామాలలో నిర్మించిన మంచినీటి ట్యాంకులను జీపీ కార్మికులతో ప్రతినెలా బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించాలని మిషన్ భగీరథ క్వాలిటీ చెకింగ్ అధికారిణి రాజ్యలక్ష్మి ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ అధికారులకు సూచించారు. ఆమె గురువారం మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయతీ పరధిలోని ధార్‌సింగ్ తండాలో తనిఖీలు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవళిక, గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద (జుక్కల్) : జీపీ కార్యదర్శులు తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీవో గోపాల్, ఎంపీవో మహబూబ్ అన్నారు. గురువారం జీపీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. నీరు వృథా కాకుండా అవసరం ఉన్నచోట అక్కడే ప్లాస్టిక్ వాటర్ ట్యాంక్ బిగించి నీరు వృథా పోకుండా స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధి పనులకు ఎక్కువ మంది కూలీ లు పనులకు వచ్చే విధంగా చూడాలని అన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : ఊరూరా ఉపాధి పనులు ప్రారంభించి కూలీల హాజరుశాతాన్ని పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. గురువారం జుక్కల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఏర్పాటు చేసిన సమీక్షలో మాట్లాడారు. ప్రతీ జీపీలో పాంపాండ్స్ నిర్మాణం ఖచ్చితంగా చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈజీఎస్ ఏపీవో తులసిరాం, ఈసీ స్వామి పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.



బిచ్కుందలో..

రైతు వ్యతిరేక విధానాలను సహించం



బాన్సువాడ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తే సహించబోమని రైతుబంధు సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు దుద్దాల అంజిరెడ్డి అన్నారు. గురువారం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ధర్నా చేపట్టారు. అన్ని రకాల ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతుధర ప్రకారం కొనుగోలు చేసి ప్రతి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, సొసైటీ చైర్మన్ క్రిష్ణారెడ్డి, నాయకులు నర్సింహులు, గోపాల్‌రెడ్డి, వెంకన్న తదితరులున్నారు.

'సంస్కృతి' సమ్మర్ క్యాంప్ ముగింపు



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ నిర్వహించిన వేదిక్ మాథ్స్, సంస్కృతి సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు గురువారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ శ్యాం సుందర్ రావు, ఉపాధ్యక్షులు అశోక్ రావు, కమిటీ సభ్యులు ప్రతాప్ గౌడ్, శంకర్, రణజిత్ మోహన్, గోవర్ధన్ రెడ్డి, ప్రధానాచార్యులు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

కామారెడ్డి టౌన్ : కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియ చేపట్టిన తర్వాత బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మాచారెడ్డి : మండలంలోని చంద్రు నాయక్ తండాకు చెందిన లకావత్ పరశురాం బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గురువారం మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు బాధిత కుటుంబానికి రూ.25 వేలు అందించి చేయూతనిచ్చారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా నిచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు రామ్మోహన్, బన్సీలాల్ తదితరులున్నారు.

పరిశుభ్రతతో డెంగీ వ్యాధికి చెక్



దోంగ్లీలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



లింగంపేటలో..

మద్నూర్(జుక్కల్) : డెంగీ వ్యాధిని అవగాహన, అప్రమత్తతోనే అరికట్టవచ్చని డోంగ్లీ పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీలేఖ సూచించారు. డోంగ్లీ పీహెచ్‌సీ పరిధిలో గురువారం సిబ్బందితో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవి, సిబ్బంది పండరి, ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో వైద్యురాలు హిమబిందు ఆధ్వర్యంలో ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సిబ్బంది యాదగిరి, ప్రదీప్, రమేశ్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్‌లో..

బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ పీహెచ్‌సీ పరిధిలో వైద్యుడు సాయిలు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ తీశారు. డెంగీ వస్తే ఆస్ప్రిన్, బ్రూఫిన్, ఐబూప్రోఫిన్ లాంటి నొప్పుల మందులు వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్టు రమేశ్, ల్యాబ్ టెక్నీషియన్లు రాంచందర్, పండరి, స్టాఫ్‌నర్సు సుమలత, కోనాపూర్, హన్మాజీపేట్ గ్రామాల ఆశవర్కర్లు పాల్గొన్నారు.



హన్మాజీపేట్‌లో..

పిట్లంలో..

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి పరిధిలో వైద్యులు, సిబ్బంది డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీలు తీశారు. కార్యక్రమంలో వైద్యులు భూమయ్య, పీహెచ్ఎన్ అన్వరి బేగం,హెల్త్ సూపర్ వైజర్‌లు యశోద, ప్రిసిలా, హెల్త్ అసిస్టెంట్స్ విజయ్ కుమార్, శ్యామ్ రావ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డిలో మత్తమాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులున్నారు.



పిట్లంలో..



మత్తమాల..

పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ బిగింపు



ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

కామారెడ్డి రూరల్ : కామారెడ్డి మండలం కోటాల్‌పల్లి, నర్సన్నపల్లి గ్రామాల మధ్య వ్యవసాయ భూముల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదవశాత్తు కిందపడగా ఈ విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు రైతులు విన్నవించినా పట్టించుకోలేదు. ట్రాన్స్‌ఫార్మర్ పడిపోయిన విషయాన్ని 'సాక్షి'లో ఈ నెల 10న 'ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం ఎండిన పంటలు' శీర్షికన కథనం ప్రచురించగా స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

నీటి సరఫరా పునరుద్ధరణ



బోరుమోటారుకు మరమ్మతులు చేసిన సిబ్బంది

బాన్సువాడ రూరల్ : మండలంలోని కోనాపూర్‌లో నెలకొన్న నీటిఎద్దడిపై గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన 'కోనాపూర్‌లో నీటి ఎద్దడి' కథనానికి మండల పంచాయతీ అధికారి సత్యనారాయణరెడ్డి స్పందించారు. చెడిపోయిన బోరుమోటారుకు మరమ్మతులు చేయించి గ్రామంలోని డబుల్‌బెడ్‌రూం కాలనీవాసులకు నీటి సరఫరాను పునరుద్ధరించారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి అర్బన్ : మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్(టిఎస్) జిల్లా అధ్యక్షుడు జే.హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం కామారెడ్డి డ్రైవర్స్‌కాలనీ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు హన్మంతురెడ్డి మాట్లాడుతూ భాషాపండితులు, పీఈటీలు అప్‌గ్రేడేషన్, 317 జీవో బాధిత ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. నారాయణఖేడ్‌లో పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయడాన్ని సమావేశం ఖండించింది. ఈ సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.రాములు, జిల్లా ప్రతినిధులు ఎస్.రాజేందర్, ఖాలీమోద్దీన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న హన్మంత్ రెడ్డి

ఎమ్మెల్యే చొరవతో జోరుగా తూకాలు



నిజాంసాగర్(జుక్కల్): వరి ధాన్యం కొనుగోళ్ల విషయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి దృష్టికి తీసుకెళ్లడంతో కొనుగోళ్లు జోరందుకున్నాయి. గురువారం నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల్లోని సుల్తాన్‌నగర్ తదితర గ్రామాల్లో వరిధాన్యం కొనుగోళ్లను కాంగ్రెస్ నాయకులు దగ్గరుండి వేగవంతం చేయించారు. వరిధాన్యం తూకాలు జోరుపెంచడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, రమేష్‌యాదవ్ తదితరులున్నారు.

ఓటీపీలు ఎవరికీ చెప్పొద్దు

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం చెప్పవద్దని పోలీసులు తెలిపారు. ఎస్సై కోనారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది గురువారం మండల కేంద్రంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే చెప్పొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వెంకట్, సాయి శివఅంజి, రవి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సంక్షిప్తం

ధాన్యం తడవకుండా చూసుకోవాలి

ఎల్లారెడ్డి : ధాన్యం తడవకుండా రైతులు తగిన చర్యలను తీసుకోవాలని తహసీల్దార్ మహేందర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తూఫాను కారణంగా వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్ కవర్లు కప్పి ఉంచాలని అన్నారు.

శాఖాగ్రంథాలయానికి బిల్లులు చెల్లించాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శాఖాగ్రంథాలయానికి జీపీల నుంచి రావాల్సిన బకాయిలను చెల్లించాలని ఇన్‌చార్జి గ్రంథపాలకుడు రాజలింగం కోరారు. మండలంలోని ఇళ్ల వినియోగదారుల నుంచి వసూలు చేసిన ఇళ్ల బిల్లుల నుంచి 8 శాతం గ్రాంట్‌ను గ్రంథాలయానికి చెల్లించాల్సి ఉంటుందన్నారు. 18 జీపీల నుంచి గ్రంథాలయానికి రూ.4 లక్షలకు పైగా బకాయిలు రావాల్సి ఉందన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

ఎల్లారెడ్డి : మూడేళ్ల దాటిన చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సీడీపీవో సరిత అన్నారు. గురువారం అంగన్‌వాడీ టీచర్లో సమావేశం నిర్వహించారు. మూడేళ్లు దాటిన చిన్నారులు ప్రైవేటు పాఠశాలల్లో చేరకుండా చూడాలని అంగన్‌వాడీల్లో చేర్పాలన్నారు.

సాయి ఆలయానికి పోటెత్తిన భక్తులు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లిలో శ్రీ షిర్డీ సాయి ఆలయానికి భక్తులు పోటెత్తి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఖాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, పల్లకీసేవ నిర్వహించారు.

బాధితుడికి ఎల్వోసీ అందజేత

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట మండలంలోని రాఘవపల్లి గ్రామానికి చెందిన అంజయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అతడి వైద్యానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. లక్షా 65 వేల ఎల్వోసీని అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

బాన్సువాడ రూరల్ : తెలంగాణ మాడల్ స్కూల్స్‌లో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం ఆసక్తి, అర్హత గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండలంలోని కొత్తాబాది మాడల్‌స్కూల్ ప్రిన్సిపల్ ఫకీరయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25కు గాను మొదటి విడత అప్లికేషన్స్ ఈనెలాఖరు వరకు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామన్నారు.

గుంతతో చింత



మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ గుంతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండేళ్లుగా ఈ రహదారిపై గుంత ఏర్పడిన పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.